క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణ సమీపంలోని కొండమోడు 122 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో అత్యవసర మరమ్మతుల వల్ల శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ పట్టణ జేఈ ఎం.సైదారావు గురువారం తెలిపారు. ఉదయం ఆరు గంటల నుంచి 10 గంటల వరకు పిడుగురాళ్ల, జానపాడు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని విద్యుత్ శాఖ జేఈ తెలిపారు.

భూసార పరీక్షలు చేయించాలి



దాచేపల్లి : రైతులు భూసార పరీక్షలు చేయించాలని ఏఓ డి.పాపకుమారి చెప్పారు. శ్రీనగర్, గామాలపాడు గ్రామాల్లో పొలంబడి కార్యక్రమం గురువారం జరిగింది. రైతులు సాగు చేస్తున్న పత్తి, మిరప, కంది పంటలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. భూసార పరీక్షలు చేయించి మట్టి నమూనాల ఆధారంగా ఎరువులు వాడటం వలన పంటలో అధిక దిగుబడులు సాధిస్తామని ఏఓ పాపకుమారి చెప్పారు. జీలుగు, పిల్లిపెసర వాడకం వల్ల భూసారం పెంచుకోవచ్చునని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కూసం నాగిరెడ్డి, జంగా సురేష్, ఎంపీటీసీలు ఆకూరి కాశీరెడ్డి, షేక్ ఆదాంసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై డ్రిప్ పరికరాలు

దాచేపల్లి : సబ్సిడీపై డ్రిప్ పరికరాలు అందిస్తున్నామని మండల వ్యవసాయశాఖ అధికారిణి డి.పాపకుమారి గురువారం తెలిపారు. ఐదు ఎకరాలలోపు పొలం ఉన్న రైతులకు 90 శాతం సబ్సిడీ వర్తిస్తుందని, 10 శాతం రైతు చెల్లించాలని, ఐదు ఎకరాల కంటే పొలం ఎక్కువగా ఉన్న రైతులకు 50 శాతం సబ్సిడీ వర్తిస్తుందని, మరో 50 శాతం రైతు చెల్లించాల్సి ఉంటుందని ఆమె వివరించారు. అలాగే ఐదు ఎకరాలలోపు పొలం ఉన్న రైతులకు 55 శాతం, ఐదు ఎకరాల కంటే ఎక్కువ పొలం ఉన్న రైతులకు 45 శాతం సబ్సిడీపై స్ప్రింకర్లు ఇస్తున్నట్లు ఆమె వెల్లడించారు. పూర్తి వివరాలకు స్థానిక మండల వ్యవసాయశాఖ అధికారిణి కార్యాలయంలో సంప్రదించాలని ఆమె కోరారు.

ముత్యాలంపాడులో ఉచిత గుండె వైద్యశిబిరం



దాచేపల్లి : మండలంలోని ముత్యాలంపాడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం ఉచిత గుండె వైద్యశిబిరం నిర్వహించారు. సర్పంచ్ నెమలికంటి వెంకటచారి ఆధ్వర్యంలో విజయవాడ హెల్ప్ హాస్పిటల్ సహకారంతో ఈ శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యులు బీపీ, ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలు ఉచితంగా చేశారు. అవసరమైన రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. అతి తక్కువ ఖర్చుతో యాంజియోగ్రాం విజయవాడ హెల్ప్ హాస్పిటల్లో చేసేందుకు ఏర్పాట్లు చేశామని వైద్యులు చెప్పారు. శిబిరంలో జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గొట్టిముక్కల పెదహనిమిరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు పాస వెంకట నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో సమస్యలు పరిష్కరిస్తా

గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలూరి



మాచర్ల: గుడ్‌మార్నింగ్ మాచర్ల కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు 7,9,10 వార్డులలో పర్యటించారు. ప్రజలతో మాట్లాడారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వార్డుల్లో పిచ్చిమొక్కల తొలగింపునకు చర్యలు తీసుకున్నారు. సమస్యలన్నీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఆయా వార్డు కౌన్సిలర్లు, పురపాలక సిబ్బంది ఉన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం గుర్తింపు

దాచేపల్లి : నడికుడి– తుమ్మలచెరువు రైల్వేస్టేషన్‌ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని జీఆర్పీ పోలీసులు గురువారం గుర్తించారు. సుమారుగా 60 సంవత్సరాల వయస్సున్న వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. మృతుడి శరీరంపై తెల్ల చొక్కా, తెల్లలుంగీ, తెల్ల టవల్ ఉందని, రైలు ఢీకొట్టటం వల్లే మృతిచెందాడని జీఆర్పీ పోలీసులు నిర్ధారించారు. పూర్తి వివరాలకు నడికుడి రైల్వేస్టేషన్‌లోని జీఆర్పీ కార్యాలయంలో సంప్రదించాలని రైల్వే పోలీసులు చెప్పారు.

ప్రగతి కూత

- రూ.18 కోట్లతో పిడుగురాళ్ల రైల్వే స్టేషన్ ఆధునికీకరణ
- 50 శాతం పూర్తయిన పనులు
- వైఎస్సార్ సీపీ హయాంలో ప్రారంభం



రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాంల వద్ద ఫుట్‌బ్రిడ్జిలు, లిఫ్ట్



కొత్తగా నిర్మిస్తున్న పిడుగురాళ్ల రైల్వే స్టేషన్ భవనాలు

పిడుగురాళ్ల: వైఎస్సార్ సీపీ హయాంలో పిడుగురాళ్లలో పడిన అభివృద్ధి అడుగులు పట్టణానికి సొబగులద్దుతున్నాయి. రైల్వే స్టేషన్‌లో ప్రగతి కూత పెడుతోంది. గతంలో చిన్న స్టేషన్‌గా ఉన్న ఇది కొత్త హంగులు సమకూర్చుకుని పెద్దగా మారనుంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో అమృత్ భారత్ పథకం ద్వారా పిడుగురాళ్ల రైల్వే స్టేషన్ ఆధునికీకరణ కోసం రూ.18 కోట్ల నిధులు మంజూరయ్యాయి. వెంటనే 2023 మార్చిలో నిర్మాణ పనులను ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. అప్పటి ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి హాజరై శిలాఫలకాలను ప్రారంభించారు. పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

50 శాతం నిర్మాణ పనులు పూర్తి

ఈ స్టేషన్ ఆధునికీకరణ పనులు ఇప్పటికే సుమారు 50 శాతం పూర్తయ్యాయి. పనుల ప్రకారం విభజించి వేర్వేరు కాంట్రాక్టర్లకు ఇవ్వటంతో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మరో ఏడాదిలోగా మొత్తం నిర్మాణ పనులు పూర్తి కానున్నాయి.



రైల్వే స్టేషన్‌లో నిర్మిస్తున్న ప్రయాణికుల, వీఐపీ విశ్రాంత గదులు

జరుగుతున్న పనులివీ..

రైల్వే స్టేషన్ ఆధునికీకరణలో ఆర్చి నిర్మాణంతో పాటు రైల్వే స్టేషన్ లైటింగ్ బోర్డులు, ఫుట్‌బ్రిడ్జిలు, రెండు రైల్వే ప్లాట్‌ఫాంల వద్ద లిఫ్టుల నిర్మాణం, రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల విశ్రాంతిగదులు, డిస్‌ప్లే బోర్డులు, టాయిలెట్లు, ప్రయాణికులకు తాగునీరు, వీఐపీ లాడ్జి ఏర్పాటు వంటివి జరుగుతున్నాయి. ఈ పనులు పూర్తయితే పిడుగురాళ్ల స్టేషన్ మోడ్రన్ రైల్వే స్టేషన్‌గా మారనుంది.

మోడ్రన్ రైల్వేస్టేషన్



పిడుగురాళ్ల రైల్వే స్టేషన్ అమృత భారత్ పథకం ద్వారా రూ.18 కోట్లతో నూతన హంగులు సంతరించుకుంటుంది. ఇప్పటికే 50 శాతం పనులు పూర్తయ్యాయి. మరో ఏడాదిలో పనులు పూర్తయి ప్రజలకు ఎంతో సౌకర్యార్థంగా స్టేషన్ అందుబాటులోకి రానుంది.

– మద్దాలి సుబ్బయ్య, జోనల్ రైల్వే యూజర్స్ కంప్లెయింట్స్ కమిటీ సభ్యులు(జెడ్ ఆర్‌యూజీసీ)

సౌకర్యంగా మారనుంది



పిడుగురాళ్ల రైల్వేస్టేషన్ గతంలో చిన్నదిగా ఉండేది. ఇప్పుడు పెద్దగా నిర్మిస్తున్నారు. విశాలంగా ఉంది. ప్రయాణికులకు చాలా సౌకర్యంగా మారనుంది, రైల్వే స్టేషన్‌ను ఆధునికీకరించటం చాలా బాగుంది.

– షేక్ జమాల్, రైల్వే ప్రయాణికుడు పిడుగురాళ్ల

అత్యుత్తమ బోధనతోపాటు ఉద్యోగావకాశాలు



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కళాశాల సెక్రటరీ శ్రీనివాసరెడ్డి, ఇన్ఫో కంపెనీ ప్రతినిధులు

మాచర్ల రూరల్: అత్యుత్తమ సాంకేతిక బోధనతో పాటు క్యాంపస్ డ్రైవ్‌లో విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు న్యూటన్స్ గ్రూప్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల సెక్రటరీ జున్నా శ్రీనివాసరెడ్డి చెప్పారు. గురువారం మండలంలోని న్యూటన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రముఖ హార్డ్‌వేర్‌కి చెందిన డేటా పాయింట్ ఇన్ఫో కంపెనీ ప్రతినిధులు విద్యార్థులకు ప్రోగ్రామింగ్‌పై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలు అందిస్తున్న శిక్షణను సద్వినియోగపర్చుకోవాలని చెప్పారు. ఇప్పటికే ప్రముఖ సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ కంపెనీ ప్రతినిధులు విద్యార్థులకు శిక్షణనిచ్చారని విద్యా సంవత్సరం ముగిసే సంవత్సరానికి మరికొన్ని కంపెనీలు కళాశాల ప్రాంగణంలో క్యాంపస్ డ్రైవ్‌లు నిర్వహిస్తాయని ఆయన చెప్పారు. శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.జగదీష్‌రెడ్డి, హెచ్‌ఓడి ఎన్ నరేష్ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకే పోటీలు



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

జెట్టిపాలెం(రెంటచింతల): విద్యార్థుల్లో దాగిన ప్రతిభను వెలికితీసేందుకే జన విజ్ఞాన వేదిక చెకుముకి సైన్స్ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కె.పాపయ్య చెప్పారు. గురువారం జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాల పోటీలకు ఎంపికైన పి.హారిక, కె.బాల గౌతమ్, జి.జ్యోతిలకు ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. ఈనెల 1న నిర్వహించిన మండలస్థాయి చెకుముకి సైన్స్ పోటీలలో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 11 టీంలు పాల్గొనగా జెట్టిపాలెం ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచి ఈనెల 16 నుంచి నిర్వహించే జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాల పోటీలకు ఎంపిక కావడం పాఠశాలకే గర్వకారణమన్నారు. విద్యార్థులలో పోటీతత్వం ఉన్నప్పుడే మంచి ఫలితాలు వస్తాయన్నారు. మండల స్థాయిలో ప్రథమ స్థానం కైవసం చేసుకున్న విద్యార్థులను ఉపాధ్యాయులు జి.విద్యాసాగర్, కె.కుమార్, టి.అలేఖ్య, ఎస్‌కే జబీనా, విద్యార్థులు అభినందించారు.

జర్నలిస్టులకు కంటి పరీక్షలు

మాచర్ల: నియోజకవర్గంలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు డాక్టర్ రామలింగారెడ్డి మ్యాక్సీ విజన్ ఆస్పత్రి వారు ఉచిత వైద్య శిబిరం నిర్వహించి అవసరమైన వారికి వైద్యాన్ని అందించేందుకు ముందుకు రావటం అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ (ఏపీయూడబ్ల్యూజే) అధ్యక్షులు కొత్తమాసు శ్రీరామమూర్తి అన్నారు. గురువారం మాచర్ల ప్రెస్ క్లబ్‌లో జర్నలిస్టులకు రామలింగారెడ్డి మ్యాక్సీవిజన్ తరఫున 60 మందికి ఉదయం నుంచి సాయంత్రం వరకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఆపరేషన్‌తో పాటు కళ్లజోళ్ల పంపిణీలో రాయితీ ఇస్తామని పేర్కొన్నారు.

ఉపాధి కోల్పోయిన వారికి న్యాయం చేస్తాం



రైల్వేస్టేషన్ రోడ్డులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

దాచేపల్లి : నడికుడి రైల్వేస్టేషన్ రోడ్డు విస్తరణ వల్ల ఉపాధి కోల్పోయిన బాధితులకు న్యాయం చేస్తామని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు చెప్పారు. నడికుడి రైల్వేస్టేషన్ రోడ్డు విస్తరణ వలన తొలగించిన షాపులను ఆయన గురువారం పరిశీలించారు. బాధితులతో మాట్లాడారు. బాధితులకు న్యాయం చేస్తామని చెప్పారు. అనంతరం మందపాటి నాగిరెడ్డి కల్యాణ మండపంలో జలవనరులశాఖ అధికారులతోపాటుగా స్థానిక నాయకులతో సమావేశమయ్యారు. తంగెడ, ఆకురాజుపల్లి, రామాపురం మేజర్ కాలువల ద్వారా పంటలకు సాగునీటిని అందించే అంశాలపై చర్చించారు. సమావేశంలో నాయకులు బెల్లంకొండ బద్రి, తంగెళ్ల శ్రీనివాసరావు, నర్రా పుల్లయ్య, సొసైటీ నారాయణ, వేముల తిరుమలకుమార్, వేముల వినోద్‌రెడ్డి, తోట వెంకటేశ్వర్లు, మునగా నిమ్మయ్య, కొప్పుల గిరి తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



రగులగడ్డలో పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

మాచవరం: పత్తిలో యాజమాన్య పద్ధతులను పాటిస్తూ పంట సాగు చేపడితే అధిక దిగుబడులు పొందవచ్చని జిల్లా వనరుల కేంద్ర వ్యవసాయాధికారి ప్రవీణ్ చెప్పారు. మండలంలోని రేగులగడ్డ, చెన్నాయపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు సాగు యాజమాన్యం, ఎరువులు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ కె.రామమ్మ, గ్రామ వ్యవసాధికారులు వంశీ, గోపి పాల్గొన్నారు.

గులాబీ పురుగు నివారణతో అధిక దిగుబడులు

పాలువాయి(రెంటచింతల): పత్తిలో గులాబీ పురుగు నివారణతో అధిక దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని పాలువాయి గ్రామంలో ఆయన రైతులకు పత్తి పంటకు ఆశించే గులాబీ రంగు పురుగు నిర్మూలనపై అవగాహన కల్పించారు. లింగాకర్షక బుట్టల ఏర్పాటుతో పురుగులను నివారించవచ్చన్నారు. బుట్టలు కావాల్సిన రైతులు స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సంప్రదిస్తే 90 శాతం సబ్సిడీపై అందిస్తామని పేర్కొన్నారు.

రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం



విజేతలకు బహుమతులను అందజేస్తున్న రాంబాబు, రోటరీ క్లబ్ సభ్యులు

మాచర్ల: పౌష్టికాహారం తీసుకోవడంతోపాటు, విద్యార్థులు క్రమశిక్షణతో ఎలా చదవాలి, సొసైటీ ద్వారా ఏం నేర్చుకోవాలి తదితర అంశాలపై మిల్లెట్స్ రాంబాబు వివరించారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్వర్గీయ కోట సైదయ్య స్మారక అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం కేసీపీ ఆడిటోరియంలో గురువారం నిర్వహించారు. రాంబాబు మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకోవాలన్నారు. రోటరీ క్లబ్ జిల్లా అసిస్టెంట్ గవర్నర్ డాక్టర్ రామకోటయ్య మాట్లాడుతూ వెనుకబడిన పల్నాడు ప్రాంతంలో మాచర్ల నియోజకవర్గంలో రోటరీ క్లబ్ పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమానికి రోటరీ క్లబ్ అధ్యక్షురాలు కొండవీటి కృష్ణ కుమారి అధ్యక్షత వహించారు. క్విజ్, వ్యాసరచన, డ్యాన్స్ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు కేసీపీ జనరల్ మేనేజర్ వెంకటరమణ, రాంబాబు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ స్మిత, రోటరీ క్లబ్ కార్యవర్గ సభ్యులు చెరుకూరి నరసింహారావు, సత్యప్రసాద్, పఠాన్‌నాగూర్‌వలి, నాగార్జునరెడ్డి, కె.శ్రీనివాసరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు



పాలువాయి జంక్షన్(రెంటచింతల): పాలువాయి జంక్షన్ వద్ద షిరిడి సాయి ఆలయంలో గురువారం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో భజనా బృందం బాబా గీతాలను ఆలపించింది. పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు ఆలయ చైర్మన్ పందిరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

చెట్టుని కూల్చిన గాలి!



మండలంలో గురువారం సాయంత్రం ఈదురు గాలులతో వర్షం కురిసింది. గాలులకు వడ్లమూడి వారిపాలెం, విప్పర్లపల్లి గ్రామాల మధ్య ఆర్ అండ్ బీ రోడ్డులో చెట్లు పడిపోయాయి. దీనివల్ల ఆ రహదారిలో తిరిగే వాహనాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో ద్విచక్ర వాహనదారులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈదురు గాలులకు మండల వ్యాప్తంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. –రొంపిచర్ల



పత్తి ఫ్యాక్టరీ బాబా ఆలయంలో లలితాంబను బాలాత్రిపురసుందరిగా అలంకరించిన దృశ్యం



మాచర్ల మండలం కొత్తపల్లి దేవాలయంలో బాలాత్రిపురసుందరీ అమ్మ



పిడుగురాళ్ల వాసవీ మాతకు వస్త్రాలు తీసుకెళ్తున్న మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు



పిడుగురాళ్లలో విశేష అలంకరణలో కనకదుర్గమ్మ



రెంటచింతలలో బాలాత్రిపుర సుందరీదేవిగా వాసవీమాత



సత్రశాల దేవస్థానంలో బాలాత్రిపురసుందరీదేవిగా భ్రమరాంబికాదేవి



మాచవరంలో భ్రమరాంబికా దేవి అలంకరణ

దేదీప్యమానం

దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం పిడుగురాళ్ల, మాచర్ల నియోజకవర్గాల్లో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయాల్లో అమ్మవార్లు బాలాత్రిపురసుందరీదేవి, అన్నపూర్ణాదేవిగా భక్తులను కటాక్షించారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవార్ల దివ్యమంగళ స్వరూపాలను భక్తులు కనులారా వీక్షించి తరించారు. పిడుగురాళ్ల జానపాడురోడ్డులోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు పట్టు వస్త్రాలను సమర్పించారు. భవానీ నగర్ కనకదుర్గమ్మ ఆలయంలో మహిళలు కుంకుమ పూజలు చేశారు.

– మాచర్ల/మాచర్ల రూరల్/పిడుగురాళ్ల/రెంటచింతల/మాచవరం/గురజాల

నేటి నుంచి చెన్నైకి బస్సు సర్వీసు



డీఎం పిచ్చయ్య

మాచర్ల: పట్టణం నుంచి చెన్నైకు శుక్రవారం నుంచి సూపర్‌లగ్జరీ బస్సును నడపనున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ ఆర్.పిచ్చయ్య గురువారం తెలిపారు. బస్సును శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ప్రారంభిస్తారని చెప్పారు. రోజూ సాయంత్రం 6 గంటలకు మాచర్లలో బయలుదేరి కారెంపూడి, వినుకొండ, పొదిలి, ఒంగోలు, నెల్లూరు, సూళ్లూరుపేట మీదుగా చెన్నైకు మరుసటి రోజు ఉదయం 5 గంటలకు చేరుతుందని పేర్కొన్నారు. అదే రోజు సాయంత్రం 6.30 గంటలకు బయలుదేరి అదే మార్గంలో మాచర్లకు చేరుతుందని వివరించారు.

మాచర్లలో భారీ వర్షం



మాచర్ల: పట్టణంలో 10 రోజుల తరువాత మళ్లీ గురువారం వర్షం కురిసింది. ఇటీవల పట్టణంలో మండుటెండలు కాస్తున్నాయి. గురువారం మధ్యాహ్నం నుంచి వాతావరణం అకస్మాత్తుగా మేఘావృత్తమైంది. మబ్బులు పట్టి సాయంత్రం 6 గంటల వరకు భారీగా వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. కాలువలు పొంగిపొర్లాయి. ఎండలతో అల్లాడిన ప్రజలు వానతో కాస్త ఉపశమనం పొందారు.

విశాఖ ఉక్కు కోసం ధర్నా



పిడుగురాళ్ల :విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అన్యాయమని ప్రజా సంఘాలు మండిపడ్డాయి. గురువారం పిడుగురాళ్లలో వామపక్ష ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీ, ధర్నా, రాస్తారోకోలో సీఐటీయూ మండల కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు మాట్లాడారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. రైతు కూలీ సంఘం నాయకులు నీలాంద్రి రాంబాబు, వామ పక్ష ప్రజా సంఘాల నాయకులు ధీకొండ వెంకటేశ్వర్లు, జి.నాగేశ్వరరావు, చావా కోటేశ్వరరావు, కె.వెంకటేశ్వరమ్మ, సుజాత, వెంకట స్వామి, సైదా, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.